క్లుప్తంగా

క్రిస్మస్ శుభాకాంక్షలు
డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



జనగామ: క్రిస్మస్ పండను పురస్కరించుకుని డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి క్రిస్టియన్ సోదరీ, సోదరిమణులకు శుభాకాంక్షలు తెలిపారు. యేసుక్రీస్తును ఆరాధించే ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. దైవ కుమారుడు మానవునిగా జన్మించిన యేసుప్రభువు జీవనం మనందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఏసుభువు తన బోధనల ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించేలా మార్గనిర్దేశం చేశారన్నారు. నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం, ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి అందించిన మహోన్నత కరుణామయుడని అన్నారు.

ప్రశాంతంగా న్యూయర్ వేడుకలను జరుపుకోవాలి

బచ్చన్నపేట: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని నర్మెట సీఐ అబ్బయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి మద్యం సేవించి వాహనాలను నడపరాదని, ఇతరులకు ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు. అలాగే డీజేలు పెట్టుకుని డ్యాన్సులు చేయొద్దన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సై హమీద్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

సన్మానం

జనగామ రూరల్: ఇటీవల జిల్లా కోర్టులో ఏజీపీగా నియమితులైన ఎనగందుల చంద్రరుషిని మంగళవారం తెలంగాణ దివ్యాంగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పంతులు ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. దివ్యాంగులకు న్యాయపరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

రాష్ట్ర పద్మశాలి సంఘం సంయుక్త కార్యదర్శికి..

బచ్చన్నపేట: ఇటీవల తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన మండల కేంద్రానికి చెందిన గుర్రపు బాలరాజును పలువురు కాంగ్రెస్ మండల నాయకులు మండల కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో మంగళవారం సన్మానించారు. విద్యానాథ్, పిన్నింటి నారాయణరెడ్డి, రాజిరెడ్డి. నరేష్, మహబూబ్, రాములు, అంజనేయులు ఉన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జఫర్‌గఢ్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పుగల్లు పశువైద్యాధికారి కాకుమాను శ్రీనాథ్ కోరారు. మండలంలోని తిడుగు గ్రామంలో మంగళవారం నిర్వహించిన పశు వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. గోపాలమిత్ర సూపర్ వైజర్ రాజేశ్వర్‌రావు, గోపాలమిత్రలు చిలువేరు నాగేష్, కత్తుల లచ్చయ్య, గుజ్జరి రాజు, దివ్య రైతులు పాల్గొన్నారు.


ప్రమాదవశాత్తు పొక్లెయినర్ వైరింగ్ దగ్ధం

బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు పొక్లెయినర్ వైరింగ్ దగ్ధమైన ఘటన మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం జరిగింది. పొక్లెయినర్ యజమాని ఆరె రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రోజు మాదిరిగా పొక్లెయినర్‌ని పార్కింగ్ చేయగా సోమవారం అందులో నుంచి పొగలు వస్తుండగా వెళ్లి చూశాడు. అప్పటికే అందులోని వైరింగ్ పూర్తిగా దగ్ధమైంది. ఆయిల్ కూడా పోయింది. దాదాపు రూ. 4 లక్షల నష్టం వాటిల్లిందని, ఈ విషయమై మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

పాలకుర్తి: సిరిసన్నగూడెంలో నక్క జైప్రకాశ్ ఆధ్వర్యంలో పేదలకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోజెస్ బాబు నిర్వహించిన జానపద కళాప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. క్రిస్మస్ ఫెయిత్ క్రైస్టు టెంపుల్ పాస్టర్ రక్షిత ఇవాంజెలియన్, మహేందర్, సౌందర్య దిలీప్, కిరణ్ వెంకట్, చంద్రయ్య, సుగుణ పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంపొందించుకోవాలి



జనగామ రూరల్: విద్యార్థులు నైతిక విలువలను పెంపొందించుకోవాలని హెచ్‌ఎం జి.నాగరాణి అన్నారు. ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా మంగళవారం పెంబర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులను రాజరాజేశ్వరీ వృద్ధాశ్రమానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రేమ, అభిమానం, అనురాగం, ఆప్యాయత, కరుణ, జాలి, దయ చిన్ననాటి నుంచే కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో విడిచిపెట్టొద్దన్నారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఆర్.వెంకటేశ్వర్లు, సుభాష్, ఉమాదేవి, వసంత పాల్గొన్నారు.

జనగామ: ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో..



జనగామ: మృదుల కిడ్స్‌లో..



జఫర్‌గఢ్: గీతాంజలి పాఠశాలలో..



క్రీస్తు బోధనలు అనుసరణీయం

జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యేసు క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమైనవని అన్నారు. యేసు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాలల కరస్పాండెంట్లు, హెచ్‌ఎంలు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు. **- సాక్షి నెట్‌వర్క్**



దేవరుప్పుల: బాలయేసు హైస్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న ఫాదర్ జాన్‌ఫ్రాన్సిస్, ఎస్సై సృజన్‌కుమార్, బ్రదర్ జేసురాజు



చిల్పూరు: పల్లగుట్ట క్యాథలిక్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు



స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్సీ కాలనీలో వేడుకల్లో యువశక్తి యూత్ బాధ్యులు



బచ్చన్నపేట: బిషప్ తుమ్మబాల పాఠశాలలో ఉపాధ్యాయులతో ఫాదర్ జోసఫ్, బాల



స్టేషన్‌ఘన్‌పూర్: కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు నరేందర్‌రెడ్డి

ర్యాలీని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

జనగామ రూరల్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినకేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27వ తేదీన డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ ర్యాలీని జయప్రదం చేయాలని పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ర్యాలీకి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలన్నారు. ర్యాలీ అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్, పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ జమాల్ షరీఫ్, పట్టణ కిసాన్ సెల్ ప్రెసిడెంట్ మోటె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ



జనగామ: పట్టణంలోని గిర్నిగడ్డకు చెందిన కందుకూరి శ్రీనివాస్ స్వామి స్వగృహంలో మంగళవారం పడిపూజ నిర్వహించారు. 16వ సారి శబరిమల యాత్రను పురస్కరించుకుని గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించి, 18 మెట్లపై పడి ముట్టించారు. స్వాముల శరణుఘోషతో కాలనీ మారుమోగింది.

శబరికి తరలిన అయ్యప్ప మాలధారులు

దేవరుప్పుల: మండలంలోని పలువురు మాలధారులు శబరిమలైకి మంగళవారం ఇరుముడులు కట్టుకొని తరలివెళ్లారు. గురుస్వామి కాసోజు చిన్నస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకం పూజలు చేసిన అనతరం ఇరుముడులతో జనగామ–సూర్యాపేట రహదారిలో రెండు కిలోమీటర్లు ప్రదర్శన చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

బచ్చన్నపేట: విద్యారంగ పరిరక్షణతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మడిశెట్టి కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 6వ మహా సభల వాల్ పోస్టర్‌లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 28, 29వ తేదీల్లో నిర్వహించే మహా సభలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. మండల ప్రధాన కార్యదర్శి గుండె కనుకయ్య, బాల్నె శ్రీనివాస్, సద్గుణచారి, శ్రీనివాస్, రాజమౌళి, రమేష్, కిరణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెన్నుతో జీసస్ చిత్రం



చిల్పూరు: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన నాఆలోచన, రైతు నేస్తం కేశిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పెన్నుతో కాగితంపై సూక్ష్మలతో జీసస్ చిత్రాన్ని వేశారు.

సంక్షిప్త సమాచారం

సాంస్కృతిక సారథి చైర్మన్‌ను కలిసిన సంజీవ


లింగాలఘణపురం: రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ గుమ్మడి వెన్నెలను మంగళవారం సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు గట్టగల్ల సంజీవ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంజీవ మాట్లాడుతూ కళాకారుల కుటుంబాన్ని గౌరవించిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నియామకం



తరిగొప్పుల: టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ జిల్లా కన్వీనర్‌గా మండలకేంద్రానికి చెందిన కొయ్యడ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కొయ్యడ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కృషిచేస్తానని తెలిపారు.

దండోరా కళా మండలి జిల్లా కోర్డినేటర్‌గా ఎల్లయ్య




పాలకుర్తి టౌన్: లక్ష డప్పులు–వెయ్యి గొంతులు కార్యక్రమంలో భాగంగా దండోరా కళా మండలి జిల్లా కోఆర్డినేటర్‌గా గుగ్గిళ్ళ ఎలయ్యను నియమించినట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ గిద్దె రాంనర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ నాయకత్వంలో మాదిగ, మాదిగ ఉపకులాల హక్కుల పరిరక్షణ కోసం చేపట్టబోయే ఏ కార్యక్రమానికైనా తన వంతు కృషి చేస్తామని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పాలకుర్తి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ రాములు అన్నారు. మంగళవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏపీఎం పిట్టల నరేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ మాట్లాడారు. అనంతరం మహిళలతో ర్యాలీ చేపట్టారు. సుధ, వెంకటేశ్వర్లు, ముత్యాల యాదగిరి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పనులకు జీపీ ట్రాక్టర్



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని విశ్వనాథపురంలో ఓ వ్యక్తికి చెందిన వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను వినియోగించిన సంఘటన సోమవారం జరుగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఓ ప్రైవేట్ వ్యక్తి తన వ్యవసాయ బావి వద్ద ఉన్న గడ్డి కట్టలను తీసుకెళ్లేందుకు గ్రామపంచాయతీని ట్రాక్టర్‌ను వినియోగించాడు. జీపీ ట్రాక్టర్‌ను ప్రైవేట్ పనులకు వినియోగించడంపై గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో వైరల్ అయింది. కాగా, గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను ఇష్టారాజ్యంగా ప్రైవేట్ పనులకు వినియోగించడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు.

నివాళి

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ గట్టగల్ల యాదయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మంగళవారం మాజీ ఎమ్మెల్యే రాజయ్య గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చేవెల్లి సంపత్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసు, నాయకులు గండి యాదగిరి, భాగ్యలక్ష్మి, ఎడ్ల రాజు, వీరయ్య, యాదగిరి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడాలి

దేవరుప్పుల: చాలీచాలని వేతనాలతో విద్యాభివృద్ధికి పాటుపడుతున్న సీసీఏ ఉద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య తెలిపారు. మంగళవారం మండలంలోని కామారెడ్డిగూడెంలో సమ్మెలో పాల్గొని స్వగ్రామానికి వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మెసేంజర్ మరిపెల్లి యాకన్న కుటుంబాన్ని ఆమె పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

27న జాతీయ ఉపాధి పనులపై ప్రజా వేదిక

రఘునాథపల్లి: మండలంలోని 36 గ్రామాల్లో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఈ నెల 27న మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ నివేదిక (ప్రజావేదిక) నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 2023 ఏప్రిల్ 01 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన పనులపై ఈ నెల 13 నుంచి 26 వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదిక ఆధారంగా ప్రజా వేదిక ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా వేదికకు ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తపాలశాఖ సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.

కాల్వకు మరమ్మతు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెంలోని కెనాల్ కాల్వలో పిచ్చిమొక్కలు పెరిగి, మట్టి పేరుకపోయింది. దీంతో సాగునీటికి ఇబ్బంది పడుతున్న సముద్రాల రైతులు సొంత ఖర్చులతో మంగళవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాల్వ సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

'సీఎంఆర్‌ఎఫ్' పేదలకు వరం

● ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి: సీఎం రిలీఫ్ ఫండ్ పేదల ఆరోగ్యానికి వరం లాంటిదని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం పాలకుర్తిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ , మండల అధ్యక్షుడు రాపాక సత్యనాయణ, రాష్ట్ర నాయకుడు ఆదినారాయణ, కమ్మగాని నాగయ్య, మొలుగూరి యాకయ్య, పన్నీరు వెంకన్న, కామారపు సునీల్, పెనుగొండ రమేష్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న సుజాతమల్లయ్య

నర్మెట: మండల కేంద్రంలోని కాశీవిశ్వనాథ ఆలయ అభివృద్ధికి రిటైర్డ్ విద్యుత్‌శాఖ ఉద్యోగి చల్ల సుజాత మల్లయ్య దంపతులు రూ.1,00,116ల విరాళాన్ని ఆలయ చైర్మన్ గంగం నర్సింహారెడ్డికి మంగళవారం ఆలయ ఆవరణలో అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కాకతీయుల కాలం నాటి ఆలయం పూర్తిగా శిథిలావస్థలకు చేరుకుందని, దాని అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవులపల్లి భాగ్యలక్ష్మీప్రతాప్‌రెడ్డి, కూకట్ల చెంద్రమౌళి, ప్రజ్ఞాపురం శ్రీధర్, పాతూరి శేఖర్, కొండం బాలయ్య, తీగుళ్ల భూపతిరెడ్డి, తిరుపతి, అంజనేయులు, అశోక్, స్వామి, మల్లేశం, రాధాకృష్ణ, రమేష్, యాదగిరి, మల్లయ్య, కుమార్, రవి పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత



మందులు పంపిణీ చేస్తున్న క్రాంతికుమార్

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన గులాం గౌస్‌పాషా గుండెపోటుతో కొద్ది నెలల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతోంది. ఇద్దరు కుమార్తెలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నెలకు రూ.20 వేల ఖర్చవుతుండటంతో దిక్కుతోచని స్థితిలో హోంగార్డు కుటుంబం ఉంది. కుటుంబ దీన స్థితిని మండల బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు మహ్మద్ ఆసీఫ్‌పాషా హ్యాపీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ టి.క్రాంతికుమార్‌కు వివరించగా వెంటనే స్పందించి హ్యాపీ సేవ ఫౌండేషన్ ద్వారా మందుల కోసం రూ.20 వేలు అందించడంతో పాటు ప్రతి నెల సాయం చేస్తానని హామీ ఇచ్చాడు. తమ దీన స్థితిపై స్పందించి పెద్ద మనస్సుతో సాయం చేసిన క్రాంతికుమార్‌కు హోంగార్డు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం

దేవరుప్పుల: మండలంలోని మున్‌పహాడ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు మొలుగూరి రవి మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, మాజీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి మంగళవారం వేర్వేరుగా పరామర్శించి ఆర్థికసాయం అందించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. విజయడెయిరీ జిల్లా అధ్యక్షుడు ధర్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఉప్పల ప్రకాష్, మాజీ ఎంపీటీసీ జాకీర్, పార్టీ గ్రామ అధ్యక్షుడు జోగు యాకన్న, పారుపెల్లి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పులిగిళ్ల వెంకన్న, ఉపాధ్యక్షుడు ఉప్పల అనిల్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

● సీఐ మహేందర్‌రెడ్డి

కొడకండ్ల: సైబర్ నేరాలపై ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి పోలీసులు, బ్యాంక్ అధికారులమని చెప్పి వివరాలు అడిగితే స్పందించవద్దని, సైబర్ నేరాల ద్వారా డబ్బులు పోగొట్టుకుంటే 1930కి కాల్ చేయాలని సూచించారు. మండలకేంద్రానికి చెందిన రాపోలు భాస్కర్‌కు అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి బ్యాంక్ అధికారులమని కేవైసీ గురించి వివరాలు కోరగా చెప్పడంతో అతని బ్యాంకు అకౌంట్ నుంచి రూ.9,050 కోల్పోవడం జరిగిందని, బొమ్మరబోయిన ప్రశాంత్‌కు ఫోన్ చేసి పోలీసులం మాట్లాడాతున్నామంటూ అర్జంట్‌గా రూ.50 వేలు పంపాలనగా అతడు కూడా మోసపోవడం జరిగిందన్నారు. ఈ రెండు మోసాలపై స్థానిక ఎస్సై చింతరాజు కేసు నమోదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి



బెల్లంపానకాన్ని పారబోస్తున్న పోలీసులు

దేవరుప్పుల: మండలంలోని మారుమూల గిరిజన ఆవాసప్రాంతమైన నల్లకుంటతండాలో గుడుంబా తయారీ స్థావరంపై ఎస్సై ఊర సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. మంగళవారం తండాలోని బానోత్ బుజ్జి ఇంటి ఆవరణలో 70 లీటర్ల బెల్లం పానకం, బానోత్ జ్యోతి ఇంట్లో 100 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ఈ సంఘటనపై తదుపరి చర్యలు తీసుకునేందుకు పాలకుర్తి ఎక్సైజ్ పోలీసు అధికారులకు సిఫారసు చేసినట్టు ఎస్సై తెలిపారు. గిరిజనులు ప్రత్యామ్నాయ ఆదాయం పేరిట గుడుంబా తయారు చేసి తమ పరిసర గ్రామాల పేద కుటుంబాల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని సూచించారు. జీవనోపాధి పొందేందుకు అనేక మార్గాలు ఉంటాయని హితవు పలికారు. దాడిలో పోలీసు సిబ్బంది యాకేష్, మసూద్ పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

● ఇప్పగూడెంలో కంపుకొడుతున్న కాలనీలు
● పట్టించుకోని పంచాయతీ అధికారులు
● దుర్వాసనతో ప్రజల నరకయాతన



యాదవకాలనీలో అపరిశుభ్రంగా డ్రెయినేజీ



రోడ్డుపై పారుతున్న మురుగునీరు



మురుగునీటిలో గేట్‌వాల్వ్

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఇప్పగూడెం గ్రామ పరిధిలో పారిశుద్ధ్యం పడకేయడంతో ప్రజలు పాట్లు పడుతున్నారు. గ్రామంలోని దాదాపు అన్ని కాలనీల్లో డ్రెయినేజీల వ్యవస్థ సక్రమంగా లేక ఎక్కడికక్కడ మురుగు నీరు కాల్వలలో నిలిచి దుర్వాసన వస్తోంది. పలు ఏరియాల్లో డ్రెయినేజీ నీరు రోడ్డుపై పారుతున్నా పట్టించుకునేవారు లేరు. ప్రధానంగా ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, వెంకమ్మగడ్డ, యాదవకాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ఏరియాల్లో ఏరియాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన డ్రెయినేజీలు కావడంతో కూలిపోయి అధ్వాన్నంగా ఉన్నాయి. డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. దాంతో డ్రెయినేజీ నీరు మురుగుకాల్వలు నిండి రోడ్డుపై ప్రవహిస్తున్నాయి. గ్రామంలో రోడ్లు సైతం అధ్వానంగా ఉన్నాయి. గుంతలమయంగా ఉన్న రోడ్లపై వాహనదారులు సర్కస్‌ఫీట్లు చేయాల్సి వస్తుంది. అధ్వాన్నపు డ్రెయినేజీలు, గుంతల రోడ్లతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

కలుషిత నీరు సరఫరా..

గ్రామంలో కుళాయిల ద్వారా వచ్చే నీరు కలుషితంగా ఉంటున్నాయి. మురుకునీరు వస్తున్నాయని, దుర్వాసనగా ఉన్నాయని ప్రజలు చెప్పినా పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. గ్రామంలోని మల్లన్నగుడి సమీపాన ఉన్న వాటర్ ట్యాంకు వద్ద తాగునీరు సరఫరా చేసే గేట్‌వాల్వ్ మురుగునీటిలో ఉంది. దాంతో గేట్‌వాల్వ్ లీకేజీతో ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ విషయమై పంచాయతీ అధికారులు, సిబ్బందికి సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆర్‌సీఎం పెద్ద చర్చి

స్టేషన్‌ఘన్‌పూర్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా డివిజన్ కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చిలను క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో సర్వాంగసుందరంగా తయారు చేశారు. ప్రధానంగా స్థానిక రోమన్ కేథలిక్ పెద్ద చర్చితో పాటు మండలంలోని సముద్రాల గ్రామంలోని పురాతన చర్చిని ఆకర్షణీయంగా అలంకరించారు.

ట్రాక్టర్‌కింద పడి యజమాని దుర్మరణం



బానోత్ రాజు మృతదేహం

దేవరుప్పుల: వ్యవసాయంతోపాటు ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ట్రాక్టర్ తీసుకున్న ఓవ్యక్తి దానికింద పడి మంగళవారం అక్కడికక్కడే దుర్మరణం పాందిన ఘటన నీర్మాల–రామరాజుపల్లి మధ్య చోటుచేసుకుంది. ఎస్సై ఊర సృజన్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధి లక్ష్మణ్‌తండా గ్రామానికి చెందిన బానోత్ రాజు(26) సొంత ట్రాక్టర్ ద్వారా కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో ఇటుక తదితర సామగ్రి సరఫరా చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం లక్ష్మక్కపల్లి నుంచి రామరాజుపల్లికి ఇటుక లోడుతో బయలు దేరాడు. నీర్మాల, రామరాజుపల్లి మధ్య ట్రాక్టర్ బ్రేకులు పనిచేయకపోవడంతో డ్రైవర్ వెంకన్న అప్రమత్తం కోసం పక్కకు ఆపే క్రమంలో ప్రమాదవశాత్తు ఇంజన్ డబ్బాపై కూర్చున్న యజమాని రాజు కిందపడిపోయాడు. ఇది గమనించని డ్రైవర్ తిరిగి ట్రాక్టర్ ఆన్‌చేసి వెళ్లే క్రమంలో ఇటుక లోడు ఉన్న డబ్బా టైరు ఎక్కడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే దుర్మరణం పొందాడు. ఈ విషయమై మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.